


*(గత సంచిక తరువాయి)*

**మేడమీద బెడ్రూం** కిటికీ తలుపులు టకటకా కొట్టుకుంటున్నాయి. అప్పుడే స్నానం చేసి వచ్చిన రచిత ఆఫీసుకి వెళ్ళడానికి రెడీ అవుతుంది.

గాలి బాగా వీస్తున్నట్టుంది.. శబ్దం మరింత ఎక్కువగా వినబడుతుంది. "అమ్మలు కిటికీ తలుపులు వేసిరామ్మా! లేకపోతే అద్దాలు పగిలిపోయేట్టున్నాయి" వంటింట్లో నుంచి అనసూయమ్మ కేకపెట్టింది. దువ్వుకోబోతున్న జుట్టుని తిరిగి పైకి మడిచి క్లిప్ పెట్టుకుని హడావుడిగా పైకి వెళ్ళింది.

మెట్లు ఎక్కి బెడ్ రూం వైపుకి వెళ్ళబోతున్నదల్లా సడన్‌గా దేనికో గుద్దుకున్నట్టయ్యింది. రచిత జుట్టుకి, చెంపలకి తెల్లగా, ఘాటైన వాసనతో నురగ నురగగా తగిలింది.

చేత్తో నుదురు తుడుచుకుంటూ తల ఎత్తి చూసేసరికి ఎదురుగా బనీన్, షార్ట్‌తో నిలబడి వున్నాడు అభి.

కండలు తిరిగిన భుజాలపై నరాలు పచ్చగా కనిపిస్తున్నాయి. అతని చెంపలమీద దట్టంగా షేవింగ్ క్రీం.

"అయామ్ సారీ. కిటికీ తలుపులు వేద్దామని వచ్చాను" అప్పటిదాకా అతను ఈ యింట్లో వున్నాడన్న విషయమే జ్ఞాపకానికి రాలేదు రచితకి.

"నేనూ అందుకే వచ్చాను" షేవింగ్ క్రీం వుండడం వల్లేమో పట్టి పట్టి మాట్లాడుతున్నాడు.

"ప్లీజ్" మర్యాదగా వాష్ బేసిన్ వైపు చేయి చూపించాడు.

రచిత జుట్టుకి, నుదురుకి అంటుకున్న క్రీం శుభ్రం చేసుకునేలోపు అతను కిటికీ తలుపులు వేసి వచ్చాడు.

"ఇటువంటి పనులు మీరే చేసుకోవాలంటే యిబ్బందిగా వుంటుందేమో కదా!" అంది అతనివైపు తిరిగి.

"ఏమనుకుంటున్నారు మీరు? నేనూ మనిషినే, కామన్‌సెన్స్ వుంది. రెండేళ్ళు యింగ్లండ్‌లో వున్నాను. నా పనులు నేనే చేసుకోవటం అలవాటు." టిష్యూతో నురుగ అంతా తుడిచేసుకుంటూ అన్నాడు.

"మంచి అలవాటు" నవ్వుతూ చెప్పి, కిందకు వెళ్ళిపోయింది. తలదువ్వుకుని, బ్యాగ్‌లో లాప్‌టాప్ పెట్టుకుని తయారయ్యేసరికి, వంటగదిలో నుంచి ఘుమఘుమలాడుతూ కమ్మటి వాసన వస్తూ వుంది.

పెనం మీద పెసరట్టు నేతిలో ఎర్రగా కాలుతూ వుంది.

"అమ్మమ్మా... త్వరగా" ప్లేటు పట్టుకుని నిల్చుంది. అనసూయమ్మ పళ్ళెంలో అల్లం పచ్చడి వేసి, దోరగా కాలిన పెసరట్టు వేసింది.

"ఆహా! ఓ బొట్టు అమృతం కానీ, కలుపుతావా నువ్వు పెసరట్టులో" ఓ ముక్క తుంచి నోట్లో పెట్టుకుంటూ అంది.

"సరేలే.. ఆ అబ్బాయిని కూడా పిలువు తింటాడు" అంది పెనం మీద యింకో అట్టువేస్తూ.

"అయ్యో నీ దుర్గాపురం బుద్దులు పోనిచ్చుకున్నావు కాదూ. అతనెక్కడో బయట తింటాడులే" నిర్లక్ష్యంగా అంది.

"యిక్కడ దగ్గర్లో ఏమి ఏడిచాయి తినడానికి అటు వెళితే గుళ్ళో ప్రసాదం. యిటు వెళితే బార్‌లో మందూ తప్ప."

"గుడి సంగతి తెలియదుగానీ, బార్‌కి వెళ్ళే అలవాటు మాత్రం బాగా వుంది" రెండురోజుల ముందు జరిగినది గుర్తొచ్చి పకపకా నవ్వింది.

వెనక్కి తిరిగి చూసేసరికి వంటగది గుమ్మము ముందు అభినవ్ నిలబడి వున్నాడు.

నవ్వుతున్నదల్లా సడన్‌గా ఆగిపోయింది రచిత.

"అల్లం పచ్చడి, పెసరట్టు తింటావా బాబూ?" అంటూ ప్లేటు పట్టుకొచ్చి ఆదరంగా అడిగింది అనసూయమ్మ.

"కాసేపటి క్రితం షేవింగ్ చేసుకున్నాడు. యింతలోనే స్నానం చేసి, ట్రిమ్‌గా తయారయ్యి వచ్చాడు. చాలా స్పీడ్" అనుకుంటూ నిశ్శబ్దంగా అతన్నే గమనిస్తూ నిల్చుంది రచిత.

"మామ్మగారూ! రేపు నాకు గారెలు చేసి పెడతారా?" అడిగాడతను.

"లక్షణంగా" ఆనందంగా చెప్పిందావిడ.

"వస్తాను మామ్మగారు.. బై రచిత."

ఎన్నాళ్ళ నుంచో పరిచయం ఉన్నవాడిలా అభిమానంగా చెప్పాడు.

"వన్ మినిట్" హఠాత్తుగా గుర్తుకు వచ్చిన దానిలా రచిత పక్కగదిలోకి పరిగెత్తింది.

కోటు, లాప్‌టాప్ బ్యాగ్ పట్టుకుని బయలుదేరడానికి సిద్ధంగా నిలబడి ఉన్నాడతను.

"ఇదిగోండి. సెకండ్ కీ. ఒకవేళ మీరు రాత్రికి లేటుగా వస్తే" రచిత పరుగున వెళ్ళి తాళం అందించింది.

"డోన్ట్ బి ఫార్మల్.. కాల్ మీ అభీ"

తాళాలు అందుకుంటూ ఆమె చేతివేళ్ళను తాకాడు.

రచితలో గగుర్పాటు "ఆ రోజు రాత్రి పూర్తిగా మీద వాలిపోతూ... వెచ్చటి వూపిరి చెంపలని తాకుతూ" అతనికిదంతా గుర్తు వుండి వుంటుందా? ఒకవేళ గుర్తుంటే అప్రయత్నంగానే రచిత సిగ్గుతో కిందకి వాలిపోయాయి కనురెప్పలు.

"సత్తెన్నా! మాలతి తీగె అంటు పక్కవాళ్ళ గార్డెన్‌లో ఆర్చికి అల్లించు బావుంటుంది."

"నీకెందుకి పనులన్నీ రచితమ్మా" సత్తెన్న మొక్కలకి పాదులు చేస్తూ అన్నాడు.

"భలే చెప్పావులే. మా దుర్గాపురంలో ఖాళీ చిక్కితే తోటపని చేసేదాన్ని. ఇప్పుడు శని, ఆదివారాలు తప్ప వీలుదొరకడం లేదు. అమ్మమ్మా! నువ్వు చెప్పు సత్తెన్నకి మన వూర్లో తోట ఎలా వుండేదో"

రచిత మాటలకి అనసూయమ్మ జవాబివ్వలేదు. ఏదో ఆలోచిస్తున్నట్టు, వేరే లోకంలో వుంది.

"అమ్మమ్మా!" రచిత రెట్టించింది.

"ఆ... అమ్మలూ" ఒక్కసారిగా ఈలోకంలోకి వచ్చినట్టు అంది.

"ఏమిటంత లావున ఆలోచిస్తున్నావ్?"

"అమ్మలూ! ఒక్కసారి ఆ అబ్బాయికి ఫోన్ చేయరాదుటే?"

"ఏ అబ్బాయికి?"

"అదేనే.. మనింట్లో దిగాడు. అభినవ్.. అతనికి"

రచిత ఒక్క క్షణం ఆలోచించింది. ''శుక్రవారం పొద్దుననగా వెళ్ళాడు. రాత్రికి యింటికి రాలేదు. ఎప్పుడు వచ్చేదీ చెప్పలేదు. పైపెచ్చు గారెలు చేయండి. అని చెప్పి మరీ వెళ్ళాడు. బహుశా తిరిగి మేనమామ యింటికే వెళ్ళాడేమో''

''బయటికి వెళ్ళిన మనిషి వేళకి యింటికి రాకపోతే ఎలాగ? కనీసం ఎక్కడున్నాడో, ఎలా వున్నాడో ఫోన్ చేసి అయినా చెప్పొద్దూ'' అనసూయమ్మ గొణుక్కుంటున్నట్టుగా పైకే అనేసింది.

''పిచ్చి అమ్మమ్మా! అతను ఫ్లైట్ ఎక్కి ఏ బాంబేలోనీ, ఢిల్లీలోనో ఫైవ్ స్టార్ హోటల్లో దిగి వుంటాడు. లేకపోతే, సరదాగా గర్ల్‌ఫ్రెండ్‌తో ఎక్కడికైనా వెళ్ళి వుండొచ్చు. నువ్వు అనవసరంగా కంగారు పడడమేగానీ, అతను బాగానే ఎంజాయ్ చేస్తూ వుండివుంటాడు.''

రచిత పైకి అలా మాట్లాడినా, మనసులో మాత్రం ఆరాటంగానే వుంది.

''నాకు తెలీదు అమ్మలు. మనింట్లో వున్నంతవరకు ఆ పిల్లాడి బాగోగులు మనవే. అతని యోగక్షేమాలు పట్టించుకోవలసిన బాధ్యత మనకి వుంది. అందులోనూ, యింట్లో వాళ్ళతో గొడవపెట్టుకున్నాడు. మనసు చెదిరిపోయి వుంటుంది'' అంది విచారంగా.

''ఎవరిమీదైనా ఎందుకంత పిచ్చిగా ప్రేమను పెంచుకుంటావు?'' లాలనగా అంది, పక్కన వచ్చి కూర్చుంటూ.

''నాకవన్నీ తెలీదు. ముందా పిల్లాడి సంగతి కనుక్కో''

రచిత లేచి యింట్లోకి వెళ్ళింది.

వెనకాలే ఆరాటంగా వచ్చి, సోఫాలో కూర్చుని చూస్తూ వుంది అనసూయమ్మ.

వాట్సప్‌లో అభీకి మెసేజ్ పెట్టింది. రిప్లై రాలేదు.

సంకోచిస్తునే కాల్ చేసింది. వాయిస్ మెయిల్‌కి వెళ్ళింది. కట్ చేసి సోఫాలో కూర్చుంది రచిత.

''ఏమైనా తెలిసిందా అమ్మలూ..?'' అనసూయమ్మ అడిగింది. రచిత సమాధానం చెప్పేలోపలే సెల్ రింగయ్యింది.

''హలో..''

''మీరు యింకా యింటికి రాకపోతే, ఎలా వున్నారో అని అమ్మమ్మ కంగారుపడుతూ వుంది, అందుకనే ఫోన్ చేశాను.''

''ఓ... సారీ రాత్రి బెంగుళూరులో మీటింగ్ లేటయ్యింది. షెం టెక్ వాళ్ళతో మీటింగ్ ఓ.కే అయ్యింది. పొద్దున్న వచ్చాను. యిప్పుడే అమ్మని కలిశాను. పదినిమిషాలలో అక్కడికే బయల్దేరి వస్తున్నాను.''

''అమ్మమ్మా! రాత్రి బెంగుళూరులో ఆలస్యం అయ్యిందట. ఇంకాసేపట్లో వస్తున్నానని చెప్పాడు'' రచిత చెప్పడంతో అనసూయమ్మ తృప్తిగా తలాడించి పూజగదిలోకి వెళ్ళింది.

''ఇంతకీ నా నెంబరు ఎలా కనుక్కున్నావ్?''

''మీ రూంలో ట్రావెల్ బ్యాగ్ మీద, లగేజీ ట్యాగ్ పైన అడ్రసూ, ఫోన్ నెంబరూ రాసి వున్నాయి.''

''ఓ... సో థాట్‌ఫుల్'' మెచ్చుకోలుగా అన్నాడు.

''అయినా, ఎక్కడికెళ్ళారో ఏం చేస్తున్నారో చెప్పకపోతే అవతలివాళ్ళు కంగారుపడతారేమో అన్న ఆలోచన వుండొద్దూ''

''ఏమో నాకోసం అంత కంగారు పడతావని నిజంగానే వూహించలేదు.''

అతని మాటల్లో ఆంతర్యం అర్థమై తత్తరపడింది రచిత. ''మేం దుర్గాపురం వాళ్ళమండీ. అలాగే వుంటాం'' అంది నవ్వుతూ.

''ఎలా అందంగా యింకా బోలెడంత మంచితనం కుప్పబోసినట్టుగానా?'' మాటల్లో కొంటెతనం వినిపించింది.

''హలో మాటలు శ్రుతిమించుతున్నాయి'' చిరుకోపం ప్రదర్శిస్తూ అంది.

''ఓ. సారీ మేడమ్ నేను యిప్పుడన్నవన్నీ మీగురించి అనుకుంటున్నారా? నేనన్నది దుర్గాపురం మామ్మగారి గురించి''

రచిత ముద్దుగా మూతి ముడుచుకుంది.

"ఓ.కే... ట్రాఫిక్‌లో వున్నాను. ఒక్క గంటలో అక్కడుంటా"

ఫోన్ కట్ చేసిన చప్పుడు.

రచిత మనసెందుకో హాయిగా అనిపించింది.

అభీ యింట్లో తిరుగుతూ వుంటే కొత్తగా వుంది. అతని గురించి ఆరాటపడడం, ఒకరి మీద ఒకరికి అభిమానం.. భార్యాభర్తా అంటే యిలాగే ఉంటారా?

"హారతి అద్దుకోవే" అనసూయమ్మ పిలుపుతో పూజగదిలోకి వచ్చింది.

"అబ్బాయి ఎంతసేపట్లో వస్తాడట?"

"ఏం?"

"ఏమిటేమిటి? వేడిగా గారెలు వేద్దామని, నోరు తెరిచి అడిగాడు"

"నోటితోనే అడుగుతారు ఎవరైనా? యిందులో విచిత్రం ఏముంది?" కనురెప్పలు ఆడిస్తూ వేళాకోళంగా అంది.

"....."

"అయ్యో అమ్మమ్మా అతనికి కావలసిన వాళ్ళంతా వున్నారు. అమ్మ, మేనమామ, కాబోయే భార్య.... మాట పట్టింపు కోసం నాలుగురోజులు మన యింట్లో ఉన్నంత మాత్రాన నీ కొడుకో, మనవడో అన్నట్టుగా అంత మమకారం దేనికి?"

అనసూయమ్మ మొహం దిగులుగా మారిపోయింది.

"నీకూ పెళ్ళై యింట్లో నా మనవడు తిరుగుతూ వుంటే, ఎలా వుంటుందో అన్న ఊహ వస్తూ వుంటుందే, ఆ అబ్బాయి మనింట్లో తిరుగుతూ వుంటే"

సరిగ్గా రచిత ఏమనుకుంటుందో అనసూయమ్మ కూడా అదే మాట అంది.

"సంబంధాలు చూడమని తెలిసినవాళ్ళకి చెప్పమంటావా? లేకపోతే నువ్వే కంప్యూటర్‌లో చూసుకుంటావా?" రచితని అడిగింది.

ఇంతలో, కాలింగ్ బెల్ మోగింది.

రచిత వెళ్ళి తలుపు తీసింది.

"లోపలికి రావచ్చా?"

అతను అడిగేదాకా గుమ్మంలో నిలబడి రెప్పవేయకుండా చూస్తున్నట్టు అర్థమై సిగ్గుపడి పక్కకి తప్పుకుంది.

అభినవ్ తిరిగి రాగానే నిశ్చింతగానూ, సంతోషంగానూ వుంది. అతను పైకి వెళ్ళి ఫ్రెష్ అయివచ్చే లోపు వేడిగా గారెలు వేసి తెచ్చింది అనసూయమ్మ.

"టిఫెన్ తినే వచ్చుంటారు. అమ్మమ్మా" రచిత కావాలనే అంది.

"అవును, మామ్మగారూ అమ్మని చూడడానికి వెళితే టిఫిన్ పెట్టకుండా పంపిస్తుందా? కాకపోతే, నేను గారెలు కూడా తింటాను" చొరవగా ప్లేటు అందుకుని రచిత వంక చూశాడు.

అభి వాళ్ళమ్మ దగ్గరికి వెళ్ళి వచ్చాడనగానే అనసూయమ్మ మొహం సంతోషంతో విప్పారింది.

"అమ్మ కోపం తాటాకు మంట లాంటిది బాబూ! ఒక్క క్షణమే వుంటుంది"

రచిత కిటికీలోనుంచి బయటకు చూస్తూ కూర్చుంది.

"ఒన్ మోర్ థింగ్ రచితా! వచ్చుంటారు. తినుంటారు. ఏమిటి? నేనూ నాతో బాటూ నా డూప్ కూడా వున్నాడా? చక్కగా తిన్నాడు, వచ్చాడు అనలేవా?" అన్నాడు రచిత వైపు చూస్తూ.

"దుర్గాపురంలో పెరిగింది బాబూ, అమ్మాయి, అందరినీ గౌరవంగా మర్యాద యిచ్చి పిలవడం అలవాటు" గర్వంగా చెప్పింది అనసూయమ్మ.

దుర్గాపురం పేరు వినగానే అభీ పకపకా నవ్వాడు.

పొలమారి దగ్గు వచ్చింది.

"అయినవాళ్ళు తలుచుకుంటున్నట్టున్నారు" అనసూయమ్మ అంది.

"బహుశా, సియానా తలుచుకుంటుందేమో" ఊహకు రాగానే రచిత మనస్సంతా అదోలా అయిపోయింది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments